

ఏలూరు రైల్వే స్టేషన్‌లో రద్దీ

గడచిన ఐదేళ్లతో పోలిస్తే ఈసారి పల్లె, పట్నం తేడా లేకుండా పండుగ వాతావరణం అలముకుంది. గతంలో రాజకీయం వేడెక్కి ఉండడం, ప్రతీది వివాదాస్పదం కావడం, సామాజిక వర్గాల వారీగా టార్గెట్‌లు పెట్టుకుని ఏదో రూపంలో అడ్డగించేవారు. ఆఖరుకి ఊళ్ళల్లో పందెం కోళ్ళ బరులు వేయాలన్నా ఏకపక్షమే. కూటమి ప్రభుత్వం రాకతో స్వేచ్ఛ లభించినట్టు అన్ని వర్గాలు పండుగ సంబరాలకు సంసిద్ధమయ్యాయి. వరుస సెలవులు కలిసి రావడంతో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, మహారాష్ట్ర తదితర ప్రాంతాలతోపాటు విదేశాల్లో ఉన్న వారు సొంతూళ్లకు చేరుకుంటున్నారు.

కలపర్రు టోల్‌గేట్ వద్ద రద్దీ

పెదపాడు, : సంక్రాంతి పండుగ వేళ స్వగ్రామాలకు, బంధువులు, స్నేహితుల ఇళ్లకు వచ్చేవారి వాహనాలతో జాతీయ రహదారితో పాటుగా గ్రామాలకు దారితీసే రహదారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. శనివారం ఉదయం నుంచే రోడ్లపైకి వాహనాల రాకపోకలు పెరగడంతో పెదపాడు మండలం కలపర్రు టోల్‌గేట్ వద్ద కొన్ని గంటల సేపు వాహనాలు బారులుదీరి కన్పించాయి. బెంగళూరు, హైదరాబాద్‌తో పాటుగా సుదూర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో వాహనాలు ఏలూరు వైపుగా జాతీయ రహదారిపై ముందుకు కదిలాయి. టోల్‌గేట్ వద్ద మధ్యాహ్నం వరకు కన్పించిన రద్దీ సాయంత్రానికి కాస్తా మందగించింది.



రారండోయ్.. పండుగ చేద్దాం

సంక్రాంతి జోష్

- పందెం కోళ్ల బరుల కోసం పోటాపోటీ
- స్థానిక ఎమ్మెల్యేలపై తీవ్ర ఒత్తిళ్లు
- న్యాయపరమైన చిక్కులు ఉన్నాయంటూ వాదిస్తున్నా ఎగబడుతున్న కేడర్
- అన్నిచోట్ల కూటమి నేతలతో జోష్
- గత ఐదేళ్లకు భిన్నంగా ఈసారి పండుగ
- వరుస సెలవులతో ఇక సందడే..

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : వాస్తవానికి సంక్రాంతి పండుగ వచ్చిందంటే ఒక్క మూడు రోజులే కాదు.. అటు పది రోజులు, ఇటు పది రోజులు ఆ జోష్ కొనసాగిస్తారు. అన్ని పనులను పక్కనపెట్టేస్తారు. మహిళలంతా ముగ్గులు, వంటల్లో నిమగ్నమైతే మగవారంతా పెద్ద పండుగ కదా అంటూ తెగ సంబరాలు చేసుకుంటారు. ప్రత్యేకించి కోడి పందేలు కోసం వేలాది మంది ఎదురు చూస్తారంటే అతిశయోక్తి కాదు. కోడి పందేలు.. జూదం వద్దని, సంప్రదాయ పండుగే ముఖ్యమని ప్రభుత్వం ఒకవైపు, న్యాయ స్థానాలు ఇంకోవైపు చైతన్యపరుస్తున్నా పాత వాసనలు వదులుకోవడానికి ఏ ఒక్కరూ సిద్ధపడడంలేదు. వారం రోజులుగా జిల్లా స్థాయిలో అటు పోలీస్, ఇటు రెవెన్యూ అధికారులు పనిగట్టుకుని కోడి పందేలు వద్దేవద్దంటూ శతవిధాలా ప్రజలను ఒప్పించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాయి.

బరుల కోసం ఎమ్మెల్యేలపై ఒత్తిడి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావడంతో కూటమిలో భాగస్వాములైన తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకుల జోష్ అంతా ఇంతా కాదు. గత ఐదేళ్ల పాటు కనీసం సంక్రాంతి పండుగ నాడైనా పందెం వేయనీయకుండా వైసీపీ ఏకపక్షంగా వ్యవహరించిందని ఈసారి దీనికి అంతకంతకు బదులు తీర్చుకుంటామన్న ధోరణిలోనే వీరంతా ఉన్నారు. ఈ క్రమంలోనే స్థానిక ఎమ్మెల్యేల వద్ద మూడు పక్షాలకు చెందిన కార్యకర్తలు కోడి పందేల బరులు తామే నడుపుకుంటామని ప్రత్యక్షంగా పోటీలు పడుతున్నారు. గతంలో జంగారెడ్డిగూడెం, పోలవరం, చింతలపూడి, ఏలూరు, దెందులూరు వంటి ప్రాంతాల్లో ఏకపక్షంగా కోడి పందేలు సాగేవి. ముందస్తుగా పోలీసులు అప్పుడు, ఇప్పుడు పందెం బరులను ధ్వంసం చేస్తూనే ఉన్నా పండుగ మూడు రోజులు జనం ఆనందం కట్టలు తెంచుకుంటూనే ఉంది. ఆదివారం నుంచి ముక్కనుమ వరకు పోలీసులెవరూ తమవైపు చూడకుండా మీరే అడ్డుగా నిలవాలంటూ వస్తున్న ఒత్తిళ్లతో ఇప్పుడు సిట్టింగ్ ఎమ్మెల్యేలంతా తలలు పట్టుకుంటున్నారు. నూజివీడు, కైకలూరులో భారీ ఎత్తున పందేలు వేసుకోవడానికి నేతలే పోటీలు పడుతున్నారు. 'గతంలో వైసీపీ అధికారంలో ఉండగా ఆ పార్టీ నాయకులంతా రెండో కంటికి తెలియకుండా నాలుగు రోజులపాటు పందేలు వేసి ఖర్చులు సమకూర్చుకున్నారు. కూటమి ఇప్పుడు అధికారంలోకి వచ్చినా ఇంకా మీనమేషాలేమిటి' అంటూ కార్యకర్తలు కామెంట్లు చేయడం సరికొత్త ఒరవడి సృష్టిస్తోంది.

కుదరదంటూనే..

యథావిధిగా నిబంధనల పేరిట కుదరదంటూనే సంప్రదాయ పందేలకు అడ్డులేదంటూ చివరి నాలుగు రోజులు పందేలకు గేట్లు తెరిచే ఆనవాయితీ ఈసారీ కొనసాగబోతుంది. ఇప్పటికే కొందరు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కార్యకర్తలు తీసుకొస్తున్న ఒత్తిడిని తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. పోలీసులు ధ్వంసం చేస్తున్నా కొత్త బరులకు అంతా రంగం సిద్ధమైంది. గతేడాది కోడి పందేల్లో దాదాపు రూ.46 కోట్ల మేర పందేల జోరు నడిచిందని అంచనా.



ఏలూరు రైల్వే స్టేషన్‌లో..

మద్యం అమ్మకాలు రెట్టింపు

మద్యం షాపుల్లో గడిచిన రెండు రోజులుగా అమ్మకాలు రెట్టింపు అయ్యాయి. రాబోయే ఐదు రోజులు మరింత జోరందుకోనున్నాయి. ఇంతకుముందైతే తెలంగాణ ప్రాంతం నుంచి తక్కువ ధరకు మద్యం తమ వెంటే తెచ్చుకుని ఇక్కడకు వచ్చేవారు. కాని ఇప్పుడా పరిస్థితి తొలగి మద్యం ధరలు ఇక్కడే అందుబాటులోకి వచ్చాయి.

చెరువుగట్లే ..ఆతిథ్యం

పట్టణ, నగర ప్రాంతాల్లో సేద తీరడానికి ఆస్కారం లేని అతిథులు తమ గ్రామానికి వస్తే వారిలో కొత్త జోష్ నింపే ప్రయత్నం జరుగుతోంది. తోటల్లో, చెరువుగట్ల మీద, పంట చేల నడుమ విందు, వినోదాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఊళ్ళకు చేరుకున్న వారంతా సండే స్పెషల్‌కు సిద్ధపడుతున్నారు. ఇప్పటికే అనేక పల్లెల్లో కొబ్బరితోటలు, పామాయిల్ తోటలకు సరుకు చేరింది. ఆ మేరకు ఆటపాటకు సిద్ధపడుతున్నారు. ఇన్నాళ్ళు పచ్చదనం లేకుండా కేవలం కాంక్రీట్ జంగిల్‌లోనే గడిపిన వారందరికీ కొత్త టేస్ట్ తెచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. టెంట్‌హౌస్‌ల నుంచి ఇప్పటి నుంచే తగిన సామగ్రి తోటల్లోకి, చెరువు గట్ల మీదకు చేరింది. పెద్ద పండుగకు పెద్ద ఏర్పాట్లు పేరిట కొందరు బడా నేతలు సిద్ధపడుతున్నారు.



కేతావత్ రాములు నాయక్

ఐటీడీఏ పీవోగా రాములు నాయక్

బుట్టాయగూడెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా కేఆర్ పురం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్, ఆర్ అండ్ ఆర్ అధికారిగా కేతావత్ రాములు నాయక్‌ను ప్రభుత్వం నియమిస్తూ శనివారం ఉత్తర్వులను జారీ చేసింది. గతంలో కృష్ణా జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీగా పనిచేసిన ఆయన ప్రస్తుతం పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు. గతంలో పనిచేసిన పీవో ఎం.సూర్యతేజ గత ఏడాది జూలై 23న బదిలీపై వెళ్ళిపోయారు. అప్పటి నుంచి కేఆర్‌పురం ఎస్‌డీసీ జె.శ్రీను కుమార్, జేసీ పి.ధాత్రిరెడ్డి ఇన్‌చార్జీ పీవోలుగా బాధ్యతలు నిర్వహించారు.



ఈవోగా బాధ్యతలు స్వీకరించిన పితాని తారకేశ్వర సత్యనారాయణ

'అప్పనవీడు' ఆలయ ఈవోగా సత్యనారాయణ

పెదపాడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం అప్పనవీడు అభయాంజనేయస్వామి దేవాలయ ఈవోగా పితాని తారకేశ్వర వీరవెంకట సత్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామం భీమేశ్వరస్వామి దేవాలయ ఈవోగా విధులు నిర్వహించారు. అప్పనవీడులో ఇప్పటి వరకు పని చేసిన ఈవో కూచిపూడి శ్రీనివాస్ కొల్లేటి కోట పెద్దింట్లమ్మ దేవస్థానానికి బదిలీ అయ్యారు.



శ్రీవారి ఆలయ పరిసరాల్లో భక్తులు

శ్రీవారి క్షేత్రానికి భక్తుల తాకిడి

ద్వారకాతిరుమల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గోవిందనామాలతో శ్రీవారి క్షేత్రం శనివారం శోభిల్లింది. స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో ఆలయానికి ఉదయం నుంచి భక్తులు వచ్చారు. దాదాపు 15 వేల మంది వరకూ భక్తులు వచ్చి ఉంటారని అధికారులు అంచనా. భక్తులు మొక్కుబడులు తీర్చుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆపై స్వామి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

జిల్లా వ్యాప్తంగా బరులు ధ్వంసం



ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెంలో కోడిపందేల బరులను ధ్వంసం చేస్తున్న పోలీసులు



ఏలూరు సమీపంలోని దుగ్గిరాలలో బరిని ధ్వంసం చేస్తున్న త్రీ టౌన్ పోలీసులు

ఏలూరు క్రైం/ద్వారకాతిరుమల/ కుక్కునూరు/జీలుగుమిల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ కపట కేపీఎస్ కిశోర్ ఆదేశాలతో జిల్లాలో పోలీసులు కోడిపందేలను నిరోధించడానికి చర్యలను చేపట్టారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా శనివారం బరులను పోలీసులు, రెవెన్యూ అధికారులు ధ్వంసం చేయడాన్ని చేపట్టారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఇప్పటికే జిల్లాలో మండలాల వారీగా పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో కోడిపందేల నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని ప్రజలకు ఈ కమిటీ కోడిపందేలు, పేకాటలు, జూదం వల్ల జరిగే అనర్థాలను వివరిస్తూ అవగాహన కార్యక్రమాలతో పాటు వాటిని నిర్వహిస్తే ఎలాంటి కఠిన చర్యలు తీసుకుంటారో వివరిస్తున్నారు. జిల్లాలో గతంలోనే కోడిపందేలు నిర్వహించిన వారిని, కత్తులు తయారు చేసే వారిని కోడిపందేలలో కోళ్ళకు కత్తులు కట్టేవారిని బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారు. పోలీస్ యంత్రాంగం, రెవెన్యూశాఖ బృందాలుగా ఏర్పడి గ్రామాలలో ఎక్కడెక్కడ కోడి పందేల ఏర్పాట్లకు బరులు సిద్ధం చేశారో గుర్తించి ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లతో ధ్వంసం చేస్తున్నారు. ఏలూరు సమీపంలోని పెదవేగిలో కోడిపందేల నిర్వహణకు భారీ ఎత్తున ఏర్పాటు చేసిన బరులను పెదవేగి తహసీల్దార్ భ్రమరాంబ, ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, పెదవేగి ఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బంది కలిసి ఎక్స్‌కవేటర్లతో బరులను ధ్వంసం చేశారు. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెంలో సీఐ విల్సన్ ఆధ్వర్యంలో కోడిపందేల బరులను పోలీసులు ధ్వసం చేశారు. అనంతరం గుణ్ణంపల్లిలో యువతకు క్రికెట్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ టి.సుధీర్ పాల్గొన్నారు. కుక్కునూరులో కోడిపందేల బరులను సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం, తాటియాకులగూడెం గ్రామాల్లో శనివారం ఇన్‌చార్జీ తహసీల్దారు ఉదయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో కోడి పందేల బరులను ధ్వంసం చేశారు. కోడి పందెల బరులు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ పి.నవీన్ కుమార్ హెచ్చరించారు. మండలంలో ఎక్కడా కోడి పందేలు నిర్వహించకుండా పోలీసులు రెవెన్యూ సిబ్బంది నిఘా ఉంచారు. జిల్లా వ్యాప్తంగా ఇదే విధమైన చర్యలను పోలీసులు శనివారం చేపట్టారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రజలు శాంతిభద్రతలకు సహకరించాలని అధికారులు కోరారు.



జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలో బరి ధ్వంసం

దేవాలయాల్లా రైల్వేస్టేషన్ల అభివృద్ధి

ఎంపీ పుట్టా , ఎమ్మెల్యే బడేటి



రైల్వే అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ మహేశ్ కుమార్

ఏలూరు టూటౌన్/ఏలూరు క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రైల్వే స్టేషన్లకు వెళ్లితే దేవాలయంలో ఉన్న అనుభూతి పొందేలా నిర్మిస్తున్నామని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. ఏలూరు రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులను శనివారం వారు పరిశీలించి కొన్ని సూచనలు ఇచ్చారు. అనంతరం రైల్వే స్టేషన్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ ఏలూరు రైల్వే స్టేషన్‌ను అమృత్ పథకంలో రూ.22 కోట్లతో ఆధునీకరిస్తున్నట్టు తెలిపారు. ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రం విశిష్టత ఉట్టిపడే రీతిలో రైల్వేస్టేషన్‌ను ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. అధికారిక అనుమతి పొందిన నమూనా ప్రకారమే పనులు జరగాలని, నాసిరకంగా చేపడితే అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మేయర్ నూర్జహాన్, స్టేషన్ మేనేజర్ ఎస్.వి.రమేష్, డివిజనల్ ఇంజనీర్ ఉపాధ్యాయ, ఏఈ సంతోష్‌కుమార్, సెక్షన్ ఇంజనీర్ నాగేశ్వరరావు, ఎస్ఎంఆర్.పెదబాబు, బొద్దాని శ్రీనివాస్, పూజారి నిరంజన్ పాల్గొన్నారు.

మాది రైతు ప్రభుత్వం : ఎమ్మెల్యే సొంగా

- చింతలపూడిలో ట్రాక్టర్ల ర్యాలీ



బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్ దంపతులు

చింతలపూడి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మా కూటమి ప్రభుత్వం.. రైతు ప్రభుత్వమని, సంక్రాంతి అంటే కుటుంబమంతా కలిసి చేసుకునే పండుగ అని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే దంపతుల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం బోయగూడెం నుంచి పట్టణలోని మార్కెట్ యార్డు వరకు 200లకు పైగా అలంకరించిన ట్రాక్టర్లతో నిర్వహించిన ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించి పాల్గొన్నారు. మార్కెట్ యార్డు వద్ద అలంకరించిన ట్రాక్టర్లకు పోటీ నిర్వహించగా ప్రథమ బహుమతి చింతలపూడి సొసైటీ కార్యదర్శి ఎం.వి.ఆర్.బాలకృష్ణ, ద్వితీయ బహుమతి అట్లూరి శ్రీనివాసరావు, తృతీయ బహుమతి మాటూరి వెంకట్రామయ్యలకు చెందిన ట్రాక్టర్లకు బహుమతులు అందుకున్నారు. ఐదుగురికి కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన ఎంఈవో కిరణ్ బాబును సన్మానించారు. ఈ కార్యక్రమంలో జె.ముత్తారెడ్డి, కె.రాజారెడ్డి, ధర్మరాజు, వెంకట్రామయ్య, నాలుగు మండలాల నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రాజెక్టును పరిశీలిస్తున్న కేంద్ర బృందం, మంత్రి నిమ్మల

2027 నాటికి పోలవరం పూర్తి

రాష్ట్ర భారీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల

కేంద్ర పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ప్రాజెక్టు పరిశీలన

బృందంలో 11 మంది ఎంపీలు, 27 మంది ఇంజనీర్లు

మెయిన్‌లో..



పండుగ వేళ విషాదం

అన్నవరం వెళుతుండగా లారీని ఢీకొన్న కారు.. ముగ్గురు భీమవరం వాసుల మృతి.. నలుగురికి గాయాలు 7

సందళ్లే.. సందళ్లే.. సంక్రాంతి.. సందళ్లే..



తెలుగింట పెద్ద పండుగ సంక్రాంతి.. మన సంస్కృతీ సంప్రదాయాలను చాటి చెప్పే పండుగ.. నిజం చెప్పాలంటే పల్లె పండుగ.. లంగా ఓణీల్లో పల్లె పడుచుల సందడి.. కొత్త అల్లుళ్ల హడావుడి.. బంధుమిత్రుల పలకరింపులతో ఇళ్లన్నీ కళకళలాడిపోతాయి.. ఉదయాన్నే ముంగిట ముచ్చటైన ముగ్గులు.. చిన్నారుల గొబ్బెమ్మల ఆటలు.. తెలతెలవారుతుండగా హరిదాసుల కీర్తనలు.. గంగిరెద్దుల వారి విన్యాసాలు.. జంగమ దేవరలు.. పిట్టలదొరల కబుర్లు.. ఇంటి ఆవరణలో మన ఆడవాళ్ల పిండివంటల మీటింగ్‌లు.. ఒకటేమిటి.. అన్నీ.. పిల్లా పెద్దా అంతా సందడి చేసే ఒక ఉత్సవం.. సంక్రాంతి.. అంతా అయిపోయి ఎవరిళ్లకు వారు వెళ్లిపోతే మళ్లీ ఎప్పుడు వస్తుందా అని సంవత్సరమంతా ఎదురుచూసే పండుగ..సంక్రాంతి..

తణుకు రూరల్ / ద్వారకాతిరుమల (ఆంధ్రజ్యోతి)



భోగి మంటలు

సంక్రాంతి పండుగ మూడు రోజుల్లో మొదటిది భోగి..గ్రామాల్లో గోవు పేడను సేకరించి పిడకలుగా చేస్తారు. అలా నెలరోజుల పాటు చేసిన ఈ పిడకలను భోగి రోజున కర్రలతో కలిపి మంటను వెలిగిస్తారు. ఈ మంటల్లో భోగి పిడకలను వేస్తారు.. భోగి మంటలకు అవసరమైన కట్టెలను పిల్లలు వారం రోజుల ముందు నుంచే సేకరిస్తుంటారు..





జంగము దేవరులు

అంబపలుకు..జగదంబ పలుకు.. కాశీ అన్నపూర్ణమ్మ...పలుకు అంటూ శంఖారావం చేస్తూ జంగమ దేవరులు.. వస్తుంటారు శ్రీశైలం సమీపంలోని అటవీ ప్రాంతాల నుంచి పలువురు జంగమదేవరులు ప్రతీ ఏటా జిల్లాలోని పలు ప్రాంతాలకు వచ్చి సంచరిస్తుంటారు. శంఖారావాలతో శివుని కీర్తిస్తూ దాతలను ఆశీర్వదిస్తుం టారు. సంక్రాంతి నెల ప్రారంభం నుంచి తెల్లవారు జామున డమరుకం వాయిస్తూ గ్రామీణులను నిద్రలేపుతారు.



పిట్టల దొర.. సోదెమ్మలు

ఆనాటి గ్రామీణులకు హాస్య భరితమైన మాటలతో గ్రామీణులను, ముఖ్యంగా మహిళలను సొంత అక్కగా ఎన్నో కానులకు అందిస్తున్నట్లు చెప్పే మాటలను విని అంతా నవ్వుకుంటుంటారు. ఆనాటి విలువైన వంటకంగా పప్పు దాకలో పడిపోతున్నట్లుగా ఎన్నో హాస్యభరితమైన మాటలు చెబుతాడు. సోదె చెబుతామమ్మ.. సోదె చెబుతాం అంటూ ఆనాటి గ్రామీణుల భవిష్యవాణిని చెప్పేవారు సోదెమ్మలు. ఇంటింటికి వచ్చి నాలుగు మాటలు చెప్పి వారి ఇచ్చింది సంతోషంగా తీసుకు వెళ్లేవారు..



గంగిరెద్దుల విన్యాసాలు

గంగిరెద్దుల ఆట మన సంప్రదాయంలో భాగం.. సంక్రాంతి నెల ప్రారంభం నుంచి గంగిరెద్దులతో వీధుల్లో తిరుగుతూ ఆటలాడిస్తారు. తమ ఇంటికొచ్చిన గంగిరెద్దును సాక్షాత్తు నందీశ్వరుడిలా భావించి మన ఇంటివారు వాటికి హారతి ఇచ్చి పూజిస్తారు.. అమ్మగారికి దండం పెట్టు.. అయ్యవారికీ దండం పెట్టు..అని అనగానే ముందరి కాళ్లెత్తి నమస్కరిస్తాయి.. ఇంటివాళ్లను పొగుడుతూ వారు ఆశీర్వదిస్తారు..



గొబ్బెళ్లోయ్..గొబ్బెళ్లోయ్

సంక్రాంతికి గ్రామాల్లో ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. సంక్రాంతి నెల ప్రారంభం నుంచి ప్రతీ ఇంటి ముందు ముత్యాల ముగ్గులు అందంగా కొలువుదీరుతాయి.. వాటి మధ్యన ఆవు పేడతో చేసిన ముద్దను ఉంచడం ఆనవాయితీగా వుంటుంది. సంక్రాంతి పండుగ మూడు రోజులూ ప్రత్యేక ముగ్గులతో పాటు ఆఖరు రోజున రథం ముగ్గుతో సాగనంపే ముగ్గుతో ఈ ముగ్గుల ప్రక్రియ ముగుస్తుంది.

కోడి పందేలు

గ్రామీణులకు సంక్రాంతికి ప్రధాన క్రీడ కోడి పందాలు. దీని కోసం ప్రత్యేకంగా కోడి పుంజులను పెంచి వాటిని సంక్రాంతి రోజున పందేలకు ఉపయోగిస్తారు. గతంలో వీటి కాళ్లకు కత్తులు కట్టకుండా కేవలం డింకీ పందాలను వేసి వినోదంగా చూసేవారు. ప్రస్తుతం పందెం కోళ్లను ఎంతో శ్రద్ధగా పోషకాహారంతో పెంచి పందాల కోసం తయారు చేస్తూ కొంతమంది ఉపాధి పొందుతుడగా కొందరు లక్షలాది రూపాయాల చేతుల మారే జూద క్రీడగా మార్చేశారు.



పిండి వంటలు



సంక్రాంతి పండుగ అంటే పిండి వంటలు కూడా. బియ్యంతో చేసిన వివిధ పిండి వంటలు సంక్రాంతి నెల ప్రారంభం కాగానే ప్రారంభిస్తారు. ఆ..రోజుల్లో రైతుల పొలంలో పండిన ధాన్యాన్ని ఇంటికి తీసుకు వస్తే వాటిని రోళ్లలో పోసి రోకళ్లతో దంచి బియ్యంగా మార్చి పిండి వంటలు చేసేవారు. నెల రోజులు ముందు నుంచే మహిళలు ఒకరికొకరు సాయం చేసుకునేవారు.. అందుకే సంక్రాంతి పండుగ కళకళలాడుతూ వుండేది. అరిసెలు, పాకం ఉండలు, కజ్జికాయలు, సున్నుండలు, జంతికలు వంటివి ప్రధానంగా చేస్తారు. ఇవన్నీ ఆరోగ్యాన్ని అందించే వంటలుగా చెబుతారు.



హరిదాసుల కీర్తనలు

సంక్రాంతి నెల ప్రారంభం నుంచి ముందుగా గ్రామాల్లో హరిదాసుల సంచారంతో మొదల వుతుంది... తెల్లవారు జామునే నగర సంకీర్తనలు చేస్తూ వీధులలో సంచరించి సంక్రాంతి విశిష్టతను తెలిపే కీర్తనలు ఆలపిస్తారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన హరిదాసులు స్వగ్రామంలోనే కాకుండా ఇతర చుట్టుపక్కల ప్రాంతాలలో తిరుగుతుంటారు. ఈ పండుగ దినాల్లో బియ్యం, నాణాలు, ఇవ్వనిదే పనులు మొదలు పెట్టని ఆచారం కూడా కొన్నిచోట్ల ఉంది.



భీమవరం కుర్రాళ్ల దుంగల వేట.. భోగి మంటల్లో వేసేందుకు..

పండుగ వేళ ధరలు మోతెక్కుతున్నాయి.. నిత్యావసర సరుకులు నింగిని తాకుతున్నాయి. కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. బియ్యం రేట్లు బరువెక్కాయి. వంట నూనెలు సలసల కాగుతున్నాయి. చికెన్ ధరలు చుక్కలంటుతున్నాయి. సంక్రాంతి పండుగ పేరుతో వ్యాపారులు, దళారులు దోచుకుంటున్నారు.

పండుగ వేళ.. ధరల మోత



వినియోగదారులను దోచుకుంటున్న వ్యాపారులు, దళారులు

ఏలూరు టూటౌన్, జనవరి 11 (ఆంధ్ర జ్యోతి): సంక్రాంతి పండుగకు పిండివంటలు చేసుకోని కుటుంబం ఉండదు. పిండి వంట లకు కావల్సిన బెల్లం, పప్పులు, వంటనూనె ధరలను అమాంతం పెంచేశారు. వంటనూనె 125 రకాన్ని బట్టి రూ.165వరకు అమ్ము తున్నారు. బియ్యం కిలో రూ.50 నుంచి రూ. 75 వరకు ఎగ బాకింది. బాస్మతిరైస్ రూ.80 నుంచి 120కి చేరుకుంది. కందిపప్పు కిలో రూ. 150 నుంచి 180 వరకు ఉంది.. పండుగ నాటికి రూ.200లకు చేరుకున్నా ఆశ్చర్యపోన వసరం లేదు. పెసరపప్పు రూ.125-150 వరకు రకాన్ని బట్టి అమ్ముతున్నారు. వేరుశనగ పప్పులు రూ.140 - 170కి ఎగబాకింది. చింతపండు రూ.220 - 300 వరకు, నెంబర్ వన్ చింతపండు రూ.400వరకు చేరుకుంది. మినపగుళ్ళు రూ.130 నుంచి 160కి చేరుకున్నాయి. వెల్లుల్లి గత కొన్ని నెలల నుంచి కేజీ రూ.400 నుంచి దిగి రావడం లేదు.

కూరగాయలు కొండెక్కాయి..

కూరగాయల ధరలు కూడా కొంతకాలం నుంచి దిగి రావడం లేదు. రెండునెలల కింద వరదలు వచ్చినప్పటి నుంచి పంటలు కొట్టుకుపోయాయి. తరువాత వేసిన పంటలు తెగుళ్ళు వచ్చి దిగుబడులు తగ్గటంతో కూరగాయ ధరలు కొండెక్కి కూర్చున్నాయి. సాధారణంగా దొండకాయలు, బెండకాయలు, వంకాయలు కిలో రూ.20 నుంచి 30 లోపు ఉండేవి. ఇప్పుడు కేజీ రూ.50 -60వరకు అమ్ముతున్నారు. చిక్కుడు కాయలు రూ.100 చేరుకున్నాయి. కంద రూ.80, చామదుంపలు రూ.60 వరకు అమ్ముతున్నారు. ఫ్రెంచ్‌బీన్స్, క్యాప్సీకం హైదరాబాదు నుంచి దిగుమతి అవడంతో రూ.80 నుంచి 100 వరకు అమ్ముతున్నారు. బంగాళదుంపలు రూ.20కి మించి ఎప్పుడు ఉండేవి కావు. కొన్ని నెలల నుంచి రూ.40కు అమ్ముతున్నారు. ఆకుకూరలు కూడా గుంటూరు నుంచి దిగుమతి కావడంతో రూ.10 నుంచి 15 వరకు అమ్ముతున్నారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండే దోసకాయ, ఆనబకాయ, పొట్లకాయలు కూడా రూ. 40 పైనే అమ్ముతున్నారు.

మాంసాహారులకూ చుక్కలే..

ఇక చికెన్ ధరలకు వస్తే కేజీ లైవ్ - 140, బ్రాయిలర్ రూ.200 , స్కిల్‌లెస్ రూ.240, ఫారం కోడి రూ.180లకు చేరాయి. చేపలు విషయానికి వస్తే కొరమేను రూ.400, రొయ్యలు రకాన్ని బట్టి ఊ.200 - 400 వరకు, తెల్లచేపలు రూ.170 నుంచి 200లు, పీతలు రూ.250కి చేరుకున్నాయి. మటన్ సంగతి చెప్పాల్సిన పని లేదు కేజీ రూ.900 నుంచి 1000 లకు చేరుకుంది. పండుగలను అడ్డం పెట్టుకుని ప్రతీసారి దళారులు, వ్యాపారులు కలిసి రేట్లు పెంచేసి వినియోగదారుల నోట్లో మట్టికొడుతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించడానికి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఏం కొనాలన్నా భయమే



నిత్యావసర వస్తువులు, కూరగాయలు, చేపలు, చికెన్, రైస్, వంటనూనెలు ఏది కొనాలన్నా భయమేస్తుంది. పండుగలకు బంధువులు, స్నేహితులు వస్తారు. వాళ్ళను సంతోష పెట్టాలంటే ఎంత రేటైనా కొనాలి. ఇప్పటికే అన్ని రకాల ధరలు పెరిగిపోయి ఉన్నాయి. పండుగ సీజన్‌ను అసరాగా తీసుకుని వ్యాపారులు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారు. దళారులను, వ్యాపారులను నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వాల పై ఉంది.

- బండి సూర్యప్రకాశ్, ఏలూరు

ఇష్టానుసారం పెంచం



ధరల రేట్లు పెరుగుదల మా చేతుల్లో ఉండదు. సాధారణంగా పండుగలకు ఎంతో కొంత రేట్లు పెంచుతూనే ఉంటారు. మాకు వచ్చిన ధరల కన్నా ఖర్చులు వేసుకుని ఎంతో కొంత లాభం చూసుకుంటాం...అవకాశం ఉంది కదా అని ఇష్టానుసారం రేట్లు పెంచి అమ్మితే తరువాత మా బిజినెస్ అంతగా సాగదు.

- మూర్తి, హోల్‌సేల్ వ్యాపారి, ఏలూరు

---

100 పిడకలు 'వంద' రూపాయలు



సంక్రాంతి పండుగలో ముఖ్యమైనది భోగి పండుగ.. ఆ రోజున భోగి మంటల్లో ఆవు పేడతో చేసిన పిడకలు వేస్తారు. ఇప్పుడు ఆవులూ తగ్గిపోయాయి.. ఆవు పిడకలు తయారు చేసేవారూ తగ్గిపోయారు. దీంతో ఇప్పుడు రడీమేడ్ బోగి పిడకలు మార్కెట్‌లో దర్శనం ఇస్తున్నాయి. భీమవరంలో వారం రోజులుగా పిడకల అమ్మకాలు చేస్తున్నారు..పిడక రూపాయి చప్పున అమ్ముతున్నారు. 100 పిడకల దండ రూ.100 రూపాయిలు అమ్ముతున్నారు **- భీమవరం టౌన్**

వెరైటీ గాలిపటాలు



సంక్రాంతి పండుగ వస్తోందంటే పిల్లలకు సందడే సందడి గాలిపటాలు ఎగవర వెయ్యడం మంచి సరదా.. గాలిపటాల సంప్రదాయం మన దగ్గర లేదు..కానీ ఇటీవల సంక్రాంతిలో ఇది కూడా చేరింది. ఇప్పుడు వివిధ రకాల్లో రెడీమేడ్ గాలిపటాలు మార్కెట్‌ను ముంచుతున్నాయి. ఈగల్, పెద్దపులి, సినిమా యాక్టర్ల బొమ్మలు తదితర మోడల్స్‌లో విక్రయిస్తున్నారు. ఒక్కోటి రూ. 50 నుంచి 500 వరకు అమ్మకాలు చేస్తునారు..

కాళ్ళకూరులో కూడారై ఉత్సవం



కాళ్ళ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం కూడారై పూజ నిర్వహించారు. కుడారై అక్కరను (పాయసం) ప్రసాదాన్ని తయారు చేసి 1250 గిన్నెలతో స్వామి, అమ్మవార్లకు నివేదించారు. ఆలయ అర్చకులు పాశురములు గానం చేశారు. ఆలయంలో పుష్పాలతో శంఖు చక్రం, స్వామి నామాలను అలంకరణ చేశారు. యతిరాజుల ఆండాళ్ గోష్ఠి వారు గోదాదేవి అమ్మవారికి చీర, సారె సమర్పించారు. ఈవో మోకా అరుణ్ కుమార్, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.



కాళ్ళకూరు వెంకన్న ఆలయంలో కూడారై పూజ సందర్భంగా 1250 పాత్రల్లో పాయసం నివేదన



వైభవం.. శ్రీవారి ధనుర్మాస ఉత్సవం

ద్వారకాతిరుమల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీదేవి, భూదేవి సమేత గోదాదేవితో కలసి చిన్నతిరుమలేశుడు తొళక్కవాహనంపై శనివారం ఉదయం తిరువీధుల్లో అట్టహాసంగా ఊరేగారు.ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని ముందుగా ఆలయ ఆవరణలో తొళక్కం వాహనంపై స్వామి, అమ్మవార్లతో పాటు గోదాదేవి ఉత్సవమూర్తులను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ఆ తరువాత మేళతాళాలు, డోలు సన్నాయి వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు.

అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్



ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ

ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత



ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ





ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత



కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మి (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి



అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

కొయ్యలగూడెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానిక కాళింగపేటలో చోటు చేసుకున్నది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం చిందాడ కర్నుడు (62) కొంతకాలంగా ఫైల్స్, షుగర్, వంటి ఇబ్బందులతో బాధపడుతున్నాడు. అయితే ఈ నెల 9వ తేదీన పురుగు మందు తాగి ఇంటికి వచ్చాడు. జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి, అనంతరం ఏలూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తల్లిదండ్రులు డబ్బు ఇవ్వడం లేదని యువకుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఒక యువకుడు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం వైఎస్ఆర్ కాలనీకి చెందిన ఎల్లోజు వినయ్ (24) కార్పెంటర్ పనులు చేస్తూ ఉంటాడు. అతనికి వివాహం కాలేదు. తల్లి దండ్రులను డబ్బులు ఇవ్వాలంటూ రోజూ వేధిస్తున్నాడు. వారు నిరాకరించడంతో శనివారం ఉదయం తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ ఎస్ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

దెందులూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దెందులూరు మండలంలో ఉండ్రాజవరం అడ్డరోడ్డు సమీపంలో శనివారం వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. శనివారం తెల్లవారుజామున రోడ్డుపై నడుస్తు వెళ్తుండగా వెనుక నుంచి వాహనం ఢీ కొనడంతో గర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కొంత మంది మాత్రం చదలవాడ సోమయ్య అని చెబుతున్నప్పటికి మృతుడి వివరాలు పూర్తిగా తెలియాల్సి ఉందని దెందులూరు ఎస్ఐ శివాజీ తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే దెందులూరు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు

లారీ ఢీకొని భార్య మృతి, భర్తకు గాయాలు



రామసీత (ఫైల్)

పాలకోడేరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొన్న ప్రమాదంలో భార్య మృతి చెందగా భర్తకు గాయాలయ్యాయి. కోరుకొల్లు గ్రామానికి చెందిన భార్యాభర్తలు ఉద్ధరాజు బాపి రాజు, భార్య రామసీతను టీవీఎస్ మోపెడ్‌పై ఎక్కించుకుని భీమవరం వైపు నుంచి కోరుకొల్లు వైపు వెళ్తుండగా పాలకోడేరు గ్రామంలోని మోగల్లు రోడ్డులో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో లారీ చక్రాల కింద పడి ఉద్ధరాజు రామసీత (63) అక్కడికక్కడే మృతి చెందగా, భర్త బాపిరాజుకు గాయాలయ్యాయి. పాలకోడేరు ఎస్ఐ రవివర్మ కేసు నమోదు చేశారు.

పండుగ వేళ విషాదం

- అన్నవరం వెళుతూ లారీని ఢీకొన్న కారు..
- ముగ్గురు భీమవరం వాసుల మృతి.. నలుగురికి తీవ్ర గాయాలు.. బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరు

భీమవరం క్రైం/శంఖవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడిలో 16వ నెంబరు జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని కారు వెనుక నుంచి ఢీకొంది. అన్నవరం దైవదర్శనానికి వెళ్తుండగా జరిగిన ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమవరం టౌన్‌కి చెందిన చవ్వాకుల శ్యాంప్రసాద్, అతని బావమరిది కరింశెట్టి శివన్నారాయణ, శివన్నారాయణ భార్య దివ్య, సత్యనాగమధు, శ్యాంప్రసాద్ భార్య చవ్వాకుల ప్రసన్న, తల్లి అమ్మాజీ, కారు డ్రైవర్ నిమ్మగడ్డ ధనుష్ కలిసి శనివారం తెల్లవారుజామున అన్నవరం రావడానికి ఉదయం 4-5 గంటల మధ్యలో కారులో బయలుదేరారు. వీరి వాహనం ఉదయం 7 గంటల సమయంలో అన్నవరానికి దగ్గర్లోనే పది కిలోమీటర్ల ముందు కత్తిపూడి వద్దకు చేరుకుంది. అక్కడ ఆగిఉన్న లారీని వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో చవ్వాకుల శ్యాంప్రసాద్(50), కరింశెట్టి శివన్నారాయణ (38), కరింశెట్టి దివ్య(30) అక్కడికక్కడే మృతి చెందగా మిగిలినవారు తీవ్రంగా గాయపడ్డారు. శ్యాంప్రసాద్ భార్య ప్రసన్న, తల్లి అమ్మాజీ అపస్మారక స్థితిలో వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. డ్రైవర్ ధనుష్ మాత్రం స్వల్పంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదానికి స్పష్టమైన కారణం తెలియనప్పటికీ నిద్రమత్తుగానీ, లారీని గమనించక పోవడంగానీ అయి ఉండొచ్చని భావిస్తున్నారు. క్షతగాత్రులను తుని, ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రులకు తీసుకెళ్లారు. ప్రత్తిపాడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కరింశెట్టి శివనారాయణ మృతి చెందగా అమ్మాజీ, సత్యనాగమధులను మెరుగైన వైద్యంకోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అన్నవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



భీమవరంలో బాధిత కుటుంబ సభ్యుల రోదనలు.. చవ్వాకుల శ్యాంప్రసాద్ (ఫైల్‌ఫొటో)..

ఆగిన లారీయే కారణం

జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీలను ఢీకొట్టడంతో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. జాతీయ రహదారిపై పార్కింగ్ ప్రాంతాల్లో మాత్రమే లారీలు నిలపాల్సి ఉండగా, ఇష్టానుసారంగా ఎక్కడబడితే అక్కడ లారీలను నిలుపుతున్నారు. ఆగి ఉన్న లారీలపై పోలీసులు తీసుకుంటున్న చర్యలు శూన్యమనే చెప్పాలి. ఏటా పదుల సంఖ్యలో మృత్యువాత పడడంతోపాటు వందల సంఖ్యలో క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు.

భీమవరంలో విషాదఛాయలు

చవ్వాకుల శ్యాంప్రసాద్ మృతితో భీమవరంలోని ఆయన నివాసం వద్ద విషాదచాయలు అలముకున్నాయి. అతడు భీమవరం గన్నాబత్తుల వారివీధిలో ఉంటున్నాడు. ఆయనకు సంతానం లేరు. యనమదుర్రులో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతని బావమరిది అయిన కరింశెట్టి శివన్నారాయణ కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలానికి చెందినవాడు. ఆయన కూడా ప్రస్తుతం భీమవరంలోనే ఉంటున్నారు. అతనికి కూడా సంతానం లేనట్లుగానే బంధువులు తెలిపారు.

18న నవోదయ ప్రవేశపరీక్ష

పెదవేగి, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్వీ)లో 6వ తరగతిలో ప్రవేశానికి ప్రవేశపరీక్ష ఈనెల 18న జరుగుతుందని జేఎన్వీ ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. ప్రిన్సిపాల్ తెలిపిన వివరాలు ప్రకారం.. 'మొత్తం 26 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఏలూరు జిల్లాలో 10, పశ్చిమగోదావరిలో 14, తూర్పు గోదావరిలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశాం. జేఎన్వీలో 6వ తరగతిలో 80 సీట్లు ఉన్నాయి. 5,828 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రవేశపరీక్ష ఈనెల 18వ తేదీ శనివారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుంది. పరీక్షా సమయానికి గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎన్‌వీఎస్‌ఏటీడీ ఏవైపీ.ఇన్/ సీబీఎస్‌ఈఐటీఎంఎస్.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్ల నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. వివరాల కోసం 63030 39477, 94907 28768, 96406 76608, 90785 68664, 89748 33690, 94917 31486 హెల్ప్‌లైన్ నంబర్లలో సంప్రదించాలి' అని సూచించారు.

వందేభారత్‌కు అదనపు కోచ్‌లు

ఏలూరు క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నుంచి సికింద్రాబాద్, సికింద్రాబాద్ నుంచి విశాఖకు నడుస్తున్న వందేభారత్ రైళ్లకు జనవరి 13వ తేదీ నుంచి అదనపు కోచ్‌లను శాశ్వతంగా ఏర్పాటు చేస్తున్నట్టు విజయవాడ దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

ఒంటరి మహిళలే టార్గెట్

అంతర్‌రాష్ట్ర దొంగను పట్టుకున్న పోలీసులు

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 11(ఆంధ్రజ్యోతి):చెడు వ్యసనాలకు బానిసైన వ్యక్తి ఒంటరిగా ఉంటున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని, తాళాలు వేసిన ఇళ్లలోకి ప్రవేశించి చోరీలకు పాల్పడ్డ నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.36లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ విశ్వనాథ్ తెలిపారు. తాడేపల్లిగూడెంలోని పట్టణ పోలిస్‌స్టేషన్ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన నిందితుడి వివరాలు వెల్లడించారు. బాపట్ల జిల్లా వెంగాల చెరువుకు చెందిన జంగాల స్వరూప్‌కుమార్ కుమార్ ముందుగా ఒంటరిగా ఉన్న మహిళలు ఎక్కడ ఉన్నారో రిక్కీ నిర్వహిస్తాడు. ఆ క్రమంలో అనుకూలంగా ఉన్న తాళాలు వేసిన ఇళ్లను కూడా తన చోరీలకు అనువుగా ఎంచుకుని తన పని కానిస్తాడు. ఈ తరహా చోరీలు రాష్ట్రంలో సుమారు 20కి పైగా స్వరూప్‌పై కేసులు నమోదయ్యాయి. తాడేపల్లిగూడెం పట్టణంలో పలు చోరీలకు పాల్పడినట్టు గుర్తించారు. పట్టణ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ఎస్సైలు నాగరాజు, బాలం శ్రీనివాస్‌లు, సిబ్బంది బృందాలుగా ఏర్పాడి నిఘా పెట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న స్వరూప్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ కేసు ఛేదించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించిన పోలీసులను డీఎస్పీ అభినందించారు.

భీమవరంలో రూ.24 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



దాత సత్యనారాయణరాజును సన్మానిస్తున్న మంత్రి సత్యకుమార్, డిప్యూటీ స్పీకర్ ఆర్‌ఆర్‌ఆర్, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు, బాపిరాజు

ఆకివీడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): భీమవరం ప్రభుత్వాసుపత్రికి రూ.24కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్‌ను మంజూరు చేస్తున్నట్టు వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రి ప్రాంగణంలో రూ.1.99కోట్ల వ్యయంతో నిర్మించిన 30 పడకల ఓపీ విభాగాన్ని, రూ.65లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నాలుగు పడకల దయాలసిస్ కేంద్రాన్ని డిప్యూటీ స్పీకర్ ఆర్‌ఆర్‌ఆర్, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి ప్రారంభించారు. ఆసుపత్రిలో అన్ని విభాగాలు పరిశీలించి, ప్రజలకు అందిస్తున్న వైద్య సహాయాలపై వైద్యులను ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడమే కాకుండా నిరంతరాయంగా పనిచేయడానికి అవసరమైన వైద్య, టెక్నికల్ తదితర సిబ్బందిని కూడా ఏర్పాటుచేసిన దాత దాట్ల సత్యనారాయణరాజు అభినందనీయులన్నారు. ఉద్దానంలో సుమారు 34వేల కిడ్నీ కేసులున్నాయని, సీకేడిగా మారకుండా నిరంతర సేవలను అందించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. గత ప్రభుత్వం నాణ్యతలేని మద్యం సరఫరా కారణంగా 1300 శాతం కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరిగారని, ఎన్నో కుటుంబాలు చిద్రం అయ్యాయన్నారు. మన రాష్ట్రంలో లక్ష మందికి పైగా కిడ్నీ వ్యాధిగ్రస్తులున్నారని అన్నారు. ప్రస్తుత జీవనశైలి కారణంగా క్యాన్సర్ వంటి రోగాలను నిరోధించేందుకు ఎన్సీడీ సర్వేను ప్రస్తుతం నిర్వహిస్తున్నామన్నారు. సర్వే నివేదికలను రెండు నెలలు అధ్యయనం చేసి రానున్న ఆరు నెలలో క్యాన్సర్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. హార్ట్ ఎటాక్ నివారణకు ముందస్తుగా పీహెచ్‌సీలలో ఇంజక్షన్ అందుబాటలో ఉంచడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా గుండె జబ్బులకు చెందిన 965 మందిని మరణించకుండా కాపాడుకోకలిగామన్నారు.

టూరిజానికి మంచి భవిష్యత్: మంత్రి దుర్గేష్



ఎంపీ అప్పలనాయుడు దంపతుల్ని సత్కరిస్తున్న దృశ్యం

నరసాపురం టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా టూరిజం రంగానికి మంచి భవిష్యత్ ఉందని, ఈ రంగానికి సంబంధించిన కోర్సుల్ని కళాశాల లో ప్రవేశపెట్టాలని టూరిజం, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. శనివారం వైఎన్ కళాశాల ప్లాటినం ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. నైతిక విలువలతో కూడిన విద్యను అందించడం వల్లే గత ఏడు దశాబ్ధాలుగా ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోగలిగారన్నారు. ఎంపీ అప్పలనాయుడు, హైకోర్టు న్యాయమూర్తి జయసూర్య మాట్లాడుతూ చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను కూడా పెంచాలన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి భవాని ప్రసాద్, గేయ రచయిత అనంత శ్రీరామ్, డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, పొన్నపల్లి రామారావు పాల్గొన్నారు.

అంతర్వేది-నరసాపురం అనుసంధానం

అంతర్వేది, నరసాపురం, పేరుపాలెంలను అనుసంధానం చేస్తూ తీరం వెంబడి టూరిజంను అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. వైఎన్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ గోదావరి తీరంలో అహ్లాదకరమైన వాతావరణం, పర్యటక, ఆధ్యాత్మిక కేంద్రాలు ఉన్నప్పటికి సరైన వసతులు లేవన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి పాలన : ఎంపీ పుట్టా

ఉంగుటూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి పాలన సాగిస్తుందని ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్ అన్నారు. శనివారం పలు మండలాల్లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముందే సంక్రాంతి వచ్చిందని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో భాగంగా సీసీ రహదారుల, మినీ గోకులంతో పాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు.


గుండుగొలనులో రహదారిని ప్రారంభిస్తున్న ఎంపీ పుట్టా, ఎమ్మెల్యే ధర్మరాజు, గన్ని

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

ఏలూరు/ఏలూరు క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు కలెక్టరేట్‌లో శనివారం ఘనంగా జరిగాయి. తొలుత ఓబన్న చిత్రపటానికి జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ పి.ధాత్రిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చరిత్రలో ఓబన్న జాతికి చేసిన సేవలు చిరస్మరణీయమని, వీరి సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా అధికారికంగా జయంతి వేడుకలను నిర్వహించడం శుభ పరిణామమన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, జిల్లా బీసీ సంక్షేమాధికారి ఆర్‌వీ నాగరాణి, ఎన్.పుష్పలత, వెంకట లక్ష్మమ్మ, గోవిందరావు తదితరులు రన్నారు. ఎస్పీ కార్యాలయంలో ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఆర్ఐ పవన్‌కుమార్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఓబన్న చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

'ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు సీఎం ఇవ్వాలి'

ఏలూరు అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికైన ఉభయ గోదావరిజిల్లాల టీచర్లకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా వేసిన అవార్డుల అందజేతను ఈ నెల 26న గణతంత్ర వేడుకల సందర్భంగానైనా ఇవ్వాలని ఎంఈవో-2ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.వి.రామకృష్ణ, ఏపీటీఎఫ్-1938 జిల్లా నాయకులు రత్నంబాబు, మోహన్‌రావు వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. గతేడాది నవంబరు 11న విజయవాడలో నిర్వహించిన పురస్కారాల అందజేత కార్యక్రమం నుంచి జిల్లాలో పురస్కారాలకు ఎంపికైన ఉపాధ్యాయులను ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకోడ్ కారణంగా అప్పట్లో ప్రభుత్వం వాయిదావేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ అవార్డులను సంబంధిత జిల్లాల కలెక్టర్లు ఆయా టీచర్లకు అందజేయాలని ఈ నెల 10న పాఠశాలవిద్య కమిషనర్ ఉత్తర్వులు జారీచేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి పురస్కారాలను ముఖ్యమంత్రి లేదా విద్యాశాఖమంత్రి లోకేశ్ అయినా అందజేసేలా చర్యలు చేపట్టాలని అభ్యర్థిస్తున్నామన్నారు.

డీపీవో కార్యాలయంలో చెట్టు నరికివేత.. కేసు నమోదు

ఏలూరు క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా పంచాయతీ కార్యాల యంలో రూ.ఎనిమిది లక్షల విలువైన చెట్టు అపహరణకు గురైనట్టు డీపీవో కె.అనురాధ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. శనివారపుపేట రోడ్డు కట్టా సుబ్బారావుతోట ఎదురుగా జిల్లా పంచాయతీ కార్యాలయం ఉంది. కార్యాలయంలో వందేళ్ల నాటి రావిచెట్టును ఈనెల 4వ తేదీ సాయంత్రం నుంచి 6వ తేదీ ఉదయం లోపు గుర్తు తెలియని వ్యక్తులు నరికి అపహరించుకుపోయారని డీపీవో పోలీసులకు ఫిర్యాదు చేశారు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డి.విటమిన్ లోపంతోనే కీళ్ల వ్యాధులు

ఏలూరు రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : విటమిన్ డి.లోపం కారణంగా చిన్న వయస్సులోనే ఎక్కువమందికి ఎముకల సాంద్రత తగ్గిపోతోందని, బోన్ డెన్సిటీకి గురవుతున్నారని ప్రముఖ ఆర్థో వైద్యులు శ్రీ కృష్ణ అన్నారు. రామచంద్రరావుపేటలోని ఆసుపత్రి ప్రాంగణంలో ప్రతినెల రెండో శనివారం నిర్వహించే ఉచిత ఆర్థో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, ఎక్స్‌రే, బోను డెన్సిటీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ప్రతినెల రెండో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కృష్ణ

ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు పంపిణీ

ఏలూరు రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సేవే లక్ష్యంగా లింగిశెట్టి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ పనిచేస్తోందని సంస్థ చైర్మన్ లింగిశెట్టి శశికుమార్, సత్యవాణి అన్నారు. సంక్రాంతి పురస్కరించుకుని నగరంలోని ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్ నేపథ్యంలో శనివారం ఖాకీ చొక్కాలను పంపిణీ చేశారు. ఖాకీ చొక్కా లేదని పోలీసులు చలానా విధిస్తున్న నేపథ్యంలో వంద మంది డ్రైవర్లకు చొక్కాలను అందించారు. ఆయన మాట్లాడుతూ 2010లో తల్లిదండ్రుల మరణం అనంతరం తోటివారికి సాయం చేయాలనే ఉద్దేశంతో లింగిశెట్టి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి అనాథ పిల్లలకు పుస్తకాలు, ఫీజులు చెల్లించలేని వారికి ఫీజులు చెల్లింపు, ఉచిత వైద్యసేవలు చేస్తున్నట్లు తెలిపారు. ఐక్య ఆటో యూనియన్ గౌరవఅధ్యక్షుడు శంకర్ రావు, సెక్రటరీ డి.ఎన్ బాబు, జి.కనకారావు, గంగాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



చొక్కాలు పంపిణీ చేస్తున్న శశికుమార్

హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలి : డీపీఆర్‌టీయూ

ఏలూరు అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : అడ్మిషన్ల సంఖ్య సంతృప్తికరంగావున్న హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలని అభ్యర్థిస్తూ పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజుకు వినతిపత్రాన్ని అందజేసినట్టు డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలతో శుక్రవారం విజయవాడలో నిర్వహించిన సమావేశంలో జీవో 117 రద్దు, ప్రత్యామ్నాయం, టీచర్ల సమస్యలు, బదిలీలపై సంఘ అభిప్రాయాలు, సూచనలతో డైరెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేసినట్టు స్థానిక మీడియాకు శనివారం తెలిపారు. గత ప్రభుత్వంలో హైస్కూళ్ళలోకి విలీనంచేసిన 3, 4, 5 తరగతులను జీవో 117ను రద్దు చేయడం ద్వారా వాటిని ప్రాథమిక పాఠశాలలకే వెనక్కి తరలించాలని కోరామన్నారు. హైస్కూల్ ప్లస్‌లను జడ్పీ జూనియర్ కళాశాలలుగా మార్చి, వాటిలో అర్హతలుగల స్కూల్ అసిస్టెంట్లను పీజీటీలుగా పదోన్నతులు కల్పించాలని సూచించామన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 60 కంటే ఎక్కువ అడ్మిషన్లువున్న స్కూళ్ళను మోడల్ ప్రాథమిక పాఠశాలగా గుర్తించి వాటిలో ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. డైరెక్టర్‌ను కలిసినవారిలో డీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను, తదితరులున్నారు.

కొమ్ముగూడెం ఏకపక్ష ఎన్నికలను రద్దు చేయాలి

ఏలూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలం కొమ్ముగూడెంలో జరిగిన పీసా ఎన్నికలు ఏకపక్షంగా జరిగాయని ఎన్నికలు నిర్వహించిన అధికారులు ఆదివాసీ చట్టాలకు విరుద్ధంగా వ్యవహరించారని శనివారం బోడిగూడెం గిరిజన గ్రామ ప్రజలు ఆరోపించారు. శనివారం ఈ సందర్భంగా గ్రామంలో 300 మంది గిరిజనులు ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు. గ్రామ సర్పంచ్ కొక్కెర వెంకటలక్ష్మి, గ్రామస్థులు సున్నం ప్రసాద్ మాట్లాడుతూ 33 తెగల్ని అదనంగా ఎస్టీలలో కలిపి నిజమైన గిరిజనులకు గిరిజన ఫలాలను దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కుంజం రామారావు, కుంజం నాగేశ్వరరావు, కలుం సుబ్బారావు, మడకం గణేష్, కుంజం నాగేంద్రకుమార్, కొత్తం మోహన్‌రావు, సున్నం వెంకటేశ్వరరావు, సున్నం గంగారత్నం తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయం

ఏలూరు రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రోటరీక్లబ్ సేవలు ప్రశంసనీయమని, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శనివారం కోల్ ఇండియా, రోటరీ జిల్లా 3020 సంయుక్తంగా ఏలూరు రోటరీ క్లబ్ ద్వారా పేద మహిళలకు 25 కుట్టు మిషన్లు ఏలూరు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమయ్యే విధంగా రోటరీ క్లబ్ చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ చైర్మన్ ఐ.పి.డి.జి రావూరి సుబ్బారావు, పూర్వ గవర్నర్ డాక్టర్ దామోదర్‌రెడ్డి, రోటరీ సభ్యులు ఎస్.రోహిత్, జగదీషన్, డి.ఎస్.ఎన్.వి రామకృష్ణ, హేమంత్‌కుమార్, బోగరాజు ప్రసాద్, నాగమణిప్రియ, రాధిక, శిరీష తదితరులు పాల్గొన్నారు.


ఏలూరు సెయింట్ థెరిస్సా కళాశాలలో విద్యార్థినుల ప్రదర్శన


జంగారెడ్డిగూడెంలో డింకీ కోడి పందేలు వేస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్


తంగెళ్లమూడి శ్రీసూర్య పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

పాఠశాల, కాలేజీల్లో సంక్రాంతి సందడి

ఏలూరు అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సంబరాలు శనివారం పలు విద్యాసంస్థల్లో కోలాహలంగా జరిగాయి. ఎన్నారై జూనియర్ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో సీఈవో వి.తులసీరామ్ మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించేవిధంగా పండుగలను పెద్దలు రూపొందించారని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్స్ కనకరత్నం, మురళీకృష్ణ, ప్రభాకరరావు, సత్యనారాయణ, సురేష్, శివకుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో విద్యార్థినులకు రంగవల్లులు, సంప్రదాయ వస్త్రధారణ, కేశాలంకరణ వంటి అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా, పరీక్షల విభాగం కంట్రోలర్ సిస్టర్ సుశీల, అధ్యాపకులు పాల్గొన్నారు.

● ఏలూరు, : చింతలపూడి నియోజకవర్గ ప్రజలంతా సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ కోరారు. శనివారం స్థానిక రాజాన రాములమ్మ చెలకలో జేఆర్‌జీ సిటీకేబుల్ ఎండి పాలపర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సంప్రదాయ డింకీ పందేలను ఎమ్మెల్యే రోషన్‌కుమార్, రాజాన పండు ప్రారంభించారు. అనంతరం ముగ్గులపోటీలలో గెలుపొందిన మహిళలకు ఎమ్మెల్యే బహుమతులను అందచేశారు. సాయంత్రం జబర్దస్త్ నటీనటులతో ప్రోగ్రాం నిర్వహించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ జెట్టి గురునాధరావు, కూటమి నాయకులు దాసరి శ్యామ్‌చంద్రశేషు, పెనుమర్తి రామకుమార్, రావూరి కృష్ణ, సాయిల సత్యనారాయణ పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్ : తంగెళ్ళమూడి శ్రీసూర్య పాఠశాలలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో భోగి మంటలు, సంప్రదాయ వంటకాలు, గొబ్బెమ్మలు, రంగవల్లులు, హరిదాసుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలన్నారు. పలు పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందించారు.

● ఉంగుటూరు :ఉంగుటూరు మండలం నారాయణపురం మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి ఆర్‌యూపీపీ మద్దతు

ఏలూరు అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ ప్రకటించిన పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్టు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్(ఆర్‌యూపీపీ)జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ఎస్. అంబేడ్కర్, కె.శివన్నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు.

సస్పెండైన టీచర్లను విధుల్లోకి తీసుకోవాలి

ఏలూరు అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పలు కారణాలతో సస్పెండైన ఉపాధ్యాయుల్లో కొందరికి సస్పెన్షన్ కాలం పదకొండు నెలలు గడుస్తున్నా విధుల్లోకి తీసుకోకపోవడం విచారకరమని, తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం ఈమేరకు డీఈవో వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రాన్ని అందజేశామన్నారు. నిజనిర్ధారణ కమిటీ నివేదికను త్వరితగతిన తెప్పించుకుని సంబంధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, ఈలోగా వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. తమ అభ్యర్థనకు స్పందించిన డీఈవో సంబంధిత ఉపాధ్యాయుల నివేదికలను రప్పించుకుని న్యాయం చేసేందుకు హామీ ఇచ్చారని వివరించారు.

డీటీఎఫ్ ధర్నాకు వెళ్లిన జిల్లా నాయకులు

ఏలూరు అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : టీచర్ల సమస్యలపై డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో నిర్వహించిన ధర్నాలో జిల్లాకు చెందిన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.నరహరి, ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణయ్య పాల్గొన్నారని సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాంతారావు, ఆదినారాయణ తెలిపారు. జిల్లానుంచి ధర్నాకు హాజరైన సంఘ నాయకుల్లో సురేష్‌కుమార్, సాయిబాబు, అనంత్, రాంబాబు తదితరులున్నారు.

టూటౌన్ ఎస్ఐ రామకృష్ణ బాధ్యతల స్వీకరణ

ఏలూరు క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని టూటౌన్ ఎస్ఐ రామకృష్ణ అన్నారు. నూతనంగా శనివారం ఏలూరు టూటౌన్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడారు. సంక్రాంతి నేపథ్యంలో కోడిపందేలు, ఇతర జూదాలకు మొగ్గుచూపకుండా యువత క్రీడలపై దృష్టి పెట్టేలా అవగాహన కల్పిస్తామన్నారు. విధుల్లో చేరిన ఆయన సీఐ రమణను మర్యాదపూర్వకంగా కలిశారు. సిబ్బంది రామకృష్ణను అభినందించారు. లక్కవరం పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పనిచేస్తూ ఆయన ఇక్కడకు వచ్చారు.

మునిసిపల్ కార్మికుల నిరసన

చింతలపూడి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద మునిసిపల్ కార్మికులు తమ సమస్యలు పరిష్కారం కావాలంటూ నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.వి.ఎస్.నారాయణ మాట్లాడుతూ ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. గత ప్రభుత్వం 2024లో రాష్ట్ర వ్యాప్త మునిసిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను జీవో రూపంలో విడుదల చేయాలని ఇంజనీరింగ్ కార్మికుల స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని, తదితర సమస్యలపై ఇప్పటికే దఫదఫాలుగా ఆందోళన చేపట్టామని, సమస్యలు పరిష్కారం కాకపోతే సమ్మెలోకి వెనుకాడబోమని హెచ్చరించారు.

బెల్టు షాపుపై దాడి.. మహిళపై కేసు

చింతలపూడి :ఊటసముద్రం గ్రామంలో బెల్టు షాపులపై దాడులు చేశామని ఎక్సైజ్ సీఐ పి.అశోక్ శనివారం తెలిపారు. ఆ గ్రామానికి చెందిన వేముల విజయ అనే మహిళ నుంచి ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

అభయ రక్షక టీంకు చిట్టి పేరుతో డిజిటల్ వెలుగులు

ఏలూరు క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : అభయ రక్షక దళ టీంకు జిల్లా ఎస్పీ కిషోర్ చిట్టిపేరుతో డిజిటల్ వెలుగులను ఇచ్చారు. ఏలూరు రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏలూరు అభయ రక్షకదళాల టీం ఇన్‌ఛార్జి ఎస్ఐ కాంతిప్రియతో సిబ్బంది ఎల్‌ఈడీ స్క్రీన్లపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. రెండు రోజుల క్రితం జిల్లా ఎస్పీ కిషోర్ ఆ వాహనాన్ని చిట్టి పేరుతో ప్రారంభించారు. ఈ చిట్టి ప్రత్యేకతలు ఏమిటంటే నాలుగువైపులా ఎల్‌ఈడీ స్క్రీన్లు కలిగి ఉండి ఆ స్క్రీన్‌లపై ఏలూరు జిల్లా పోలీసు శాఖ అందించే సేవలు వాటితో పాటుగా అభయ రక్షకదళం టీం అందించే సేవలు ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డిస్‌ప్లే చేస్తారు. ఈ టీం శనివారం ఏలూరు రూరల్ పరిధిలోని పలు ప్రాంతాలలో అవగాహన కల్పించారు. ఎస్ఐ కాంతిప్రియ మాట్లాడుతూ అభయ రక్షకదళంపై పూర్తిగా అవగాహన కల్పించామని తెలిపారు. ఆపదలో ఉన్న మహిళలు 112 నంబరుకు ఫోన్ చేయడం ద్వారా సాయం పొందవచ్చన్నారు. మహిళా సిబ్బంది, మహిళా రక్షకదళ టీం సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



అభయ రక్షకదళం నిర్వహిస్తున్న ఎల్‌ఈడీ స్క్రీన్‌తో అవగాహన కార్యక్రమం

కొల్లేరు ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం : చింతమనేని

పెదవేగి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కొల్లేరు ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శనివారం దుగ్గిరాలలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసిన కొల్లేరు లంక గ్రామస్థులు తమ గోడును వెళ్ళబోసుకున్నారు. ఇటీవల కాలంలో అటవీశాఖాధికారులు చెరువులకు గండ్లు కొడుతున్నారని, దీంతో మేము ఉపాధిని కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఉందని విన్నవించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొల్లేరు సమస్యను గతంలోనే సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ళామని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో కొల్లేరును మూడో కాంటూరుకు కుదించి, కొల్లేరు ప్రజలకు అండగా నిలిచేలా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. కొల్లేరు లంకల గ్రామస్థులు నంబూరి నాగరాజు, సైదు సత్యనారాయణ, నేతల రవితోపాటు ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

కొఠారు ఇంటి ఎదుట 28వ రోజు ఆందోళన

చెమటోడ్చి చెరువులు తవ్వుకుంటే అధికారాన్ని అడ్డుపెట్టుకుని అప్పటి వైసీపీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మా కష్టార్జితాన్ని దోచుకుతిన్నారని లంక గ్రామస్థులు ఆరోపించారు. అదేమని అడిగినందుకు మమ్మల్ని జైలుకు పంపించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొండరావుపాలెంలోని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇంటి దగ్గర లంక గ్రామస్థులు 28వరోజు శనివారం తమ ఆందోళన కొనసాగించారు.

స్టాఫ్ నర్సులకు సర్వీస్ సర్టిఫికెట్ల జారీ

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఏలూరు అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సర్వీస్ సర్టిఫికెట్ల కోసం శనివారం వరకు దరఖాస్తు చేసుకున్న స్టాఫ్ నర్సులందరికీ వారు పనిచేసిన కాలానికి సంబంధించి రికార్డులను నర్సింగ్ సూపరింటెండెంట్‌తో పరిశీలన చేయించి జారీ చేసినట్టు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అడిషనల్ సూపరింటెండెంట్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఓ ప్రకటనలో తెలిపారు. సర్వీస్ సర్టిఫికెట్లకోసం ప్రస్తుతం కొత్తజిల్లాల్లో పనిచేస్తున్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌సర్వీస్ స్టాఫ్‌నర్సులు ఇక్కట్లు పడుతున్నారని పేర్కొంటూ 'సర్వీస్ సర్టిఫికెట్ ఇవ్వండి సారూ ' శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆసుపత్రి ఉన్నతాధికారులు స్పందించారు. సర్వీస్ సర్టిఫికెట్ల కోసం శనివారం వరకు 39 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, వారు పనిచేసిన కాలానికి సర్టిఫికెట్లు జారీ చేసినట్టు వివరణ ఇచ్చారు.

ఫ్లిప్‌కార్ట్ కార్యాలయంలో చోరీ నిందితుల అరెస్ట్

» రూ.5.73 లక్షల సొత్తు స్వాధీనం

ఏలూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం పట్టణంలోని సాయిబాలాజీ టౌన్‌షిప్ లో ఉన్న ఫ్లిప్‌కార్ట్ కార్యాలయంలో గత నెల 30న లాకర్‌లో ఉన్న రూ.3.73 లక్షల నగదు దోచుకున్న ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశామని డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. శనివారం స్థానిక సీఐ కార్యాలయంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఈ కేసులో నిందితులైన జంగారెడ్డిగూడెం మండలంలోని ఎ.పోలవరానికి చెందిన పిల్లి నాగదుర్గారావు, పిల్లి అనిల్, తానింకి విజయబాబు, బుట్టాయగూడెం మండలం ఖండ్రిగగూడెంకు చెందిన రుద్రుల సాయికృష్ణ, 2022లో ఇదే ఫ్లిప్‌కార్ట్ కార్యాలయంలో పిల్లి నాగదుర్గారావుతో పాటు రూ.2 లక్షల దొంగతనానికి పాల్పడిన ఎ.పోలవరానికి చెందిన ముదరకోల నాగబాబులను జంగారెడ్డిగూడెం పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. వీరి నుంచి మొత్తం రూ.5.73 లక్షల నగదు, ఐరన్ రాడ్లు, హార్డ్ డిస్క్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రధాన నిందితుడైన పిల్లి నాగదుర్గారావు ఫ్లిప్‌కార్ట్ కార్యాలయంలో ఆరేళ్ల పనిచేశాడు. కంపెనీ ప్రతినిధులు అతడిని రెండు నెలల క్రితం విధుల నుంచి తొలగించారు. ప్రస్తుతం ఇంటి వద్ద ఖాళీగా ఉంటూ డిసెంబరు 30 అర్ధరాత్రి కార్యాలయం దగ్గరకు వెళ్లి షట్టర్ తాళాలు తీసి లోపలికి దొంగతనానికి పాల్పడ్డారు. నిందితులను పట్టుకోవడంలో సీఐ కృష్ణబాబుతో పాటు సహకరించిన ఎస్ఐ ఎస్‌కె.జబీర్‌ను ఏఎస్ఐలు సంపత్, రాజేంద్ర, పీసీలు రమేష్, రాజశేఖర్‌లను ఆయన అభినందించారు.

లారీ ఢీకొని మోటారు సైక్లిస్టు మృతి

పెదవేగి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : లారీని దాటి ముందుకెళ్ళిన ద్విచక్రవాహనాన్ని వెనుకనుంచి లారీ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలివి.. ఏలూరుకు చెందిన వన్నెంరెడ్డి శ్యామ్(55) పెదవేగి మండలం రామశింగవరంలో కేబుల్ నెట్ వర్క్‌ను నిర్వహిస్తున్నాడు. ప్రతిరోజు మధ్యాహ్నం సమయంలో ఏలూరు నుంచి రామశింగవరం వచ్చి కేబుల్ పని చూసుకుని, తిరిగి రాత్రికి ఏలూరు వెళ్తాడు. ఇదే క్రమంలో శనివారం రాత్రి రామశింగవరం నుంచి ద్విచక్ర వాహనంపై ఏలూరు వెళ్తుండగా పెదవేగి ఎస్ఎంసీ పాఠశాల సమీపంలో టేకు దుంగల లోడుతో వెళ్తున్న లారీని తప్పించి ముందు కెళ్ళాడు. వెనుకే వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయన భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

డైరీలు, క్యాలెండర్ల ఆవిష్కరణ

ఏలూరు అర్బన్/ఏలూరు కార్పోరేషన్/ టి.నరసాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ముద్రించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను శనివారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆవిష్కరించారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ 2025 డైరీని ఏలూరు ఆర్ఆర్‌పేటలోని స్ఫూర్తిభవన్‌లో ఐఏఎల్ నాయకులు ఆవిష్కరించారు. ఐఏఎల్ నాయకులు వాకాడ రాజారావు, పి.ఎస్.చందు పాల్గొన్నారు. టి. నరసాపురంలో బంజారా భజరంగీభేరి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన క్యాలెండర్‌ను మాజీ సర్పంచ్ జరభల పూర్ణయ్య, బూక్యా విదానం శనివారం ఆవిష్కరించారు.

ఇంటర్వ్యూ..

సంక్రాంతి పండుగ ఆనందంగా జరుపుకోవాలి

యు. రవిచంద్ర
డీఎస్పీ,జంగారెడ్డిగూడెం



● **జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలో ఎన్ని పోలీస్ స్టేషన్లు ఉన్నాయి ?**

జవాబు : జంగారెడ్డిగూడెం, చింతలపూడి సర్కిల్ కార్యాలయాలతో పాటు జంగారెడ్డిగూడెం, లక్కవరం, తడికలపూడి, చింతలపూడి, ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్లు ఉన్నాయి.

● **కోడి పందేలకు అనుమతులున్నాయా ?**

జవాబు : కోడి పందేలు, పేకాట, గుండాట వంటి జూదక్రీడలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదు. హైకోర్టు కూడా కోడి పందేలను నిషేధించింది. నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

● **సబ్ డివిజన్ పరిధిలో ఎంతమందిని బైండోవర్ చేశారు ?**

జవాబు : ఇప్పటివరకు 300 మందిని బైండోవర్ చేశాం. కోడి పందేల బరులను ధ్వంసం చేస్తున్నాం.

● **సంక్రాంతి సందర్భంగా ప్రజలకు మీరిచ్చే సందేశం ?**

జవాబు : సంక్రాంతి పండుగను ప్రజలంతా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలి. యువకులు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ వంటి ఆటలు ఆడాలి.

(ఆంధ్రజ్యోతి-ఏలూరు)

అధికారులపై చర్యలు తీసుకోవాలి

» గిరిజనుల ధర్నా

బుట్టాయగూడెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నిర్మాణం చేస్తున్న గిరిజన మహిళ మడకపాటి అనూషపై దౌర్జన్యం చేసిన తహసీల్దార్ పీవీ చలపతిరావు, వీఆర్‌వో పోతురాజు, ఎస్ఐ డి.దుర్గామహేశ్వ రావుపై చర్యలు తీసుకోవాలంటూ శనివారం ఆదివాసీ గిరిజన సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాయకులు, గిరిజనులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ గిరిజన మహిళపై దౌర్జన్యం చేసిన అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి గిరిజనులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. చట్టాలను రక్షించాల్సిన అధికారులే దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. ఆయా అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి, పోలోజు నాగేశ్వరరావు, శేఖర్, గంగరాజు, ముత్యాలరావు, బుల్లెమ్మ, సత్యనారాయణ, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.



జనసేన పార్టీలోకి వైసీపీ కార్యకర్తలు చేరిక

ఉంగుటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : జనసేనాని పవన్ కల్యాణ్ ఆశయాలను ప్రతిఒక్క కార్యకర్త నిర్వర్తించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిడమర్రు మండలం సిద్ధాపురంలో వైసీపీ కార్యకర్తలు నౌడు మణీంద్ర, కసిరెడ్డి హరినాథ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి జనసేన కండువాలు కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు. జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

విద్యావనరుల కేంద్రానికి బీటలు

కలిదిండి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల విద్యావనరుల కేంద్రం భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. 12 ఏళ్ల క్రితం ఈ భవనాన్ని నిర్మించారు. 2024 మేలో శ్లాబ్ కూలడంతో కంప్యూటర్లు ధ్వంసం కాగా అప్పటి ఎంఈవో ప్రభాకర్‌బాబు తలకు తీవ్ర గాయమైంది. కిటికీల తలుపులు ఊడి పోయాయి. గోడలు బీటలు వారాయి. శ్లాబ్ పిల్లర్లు పగుళ్ల రావడంతో ఇనుప చువ్వలు బయట పడ్డాయి. భవనానికి తాత్కాలిక మరమ్మతులు చేసినప్ప టికీ ఫలితం ఉండదని, నూతన భవనం నిర్మించాలని సంబంధిత ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేదని విద్యాశాఖ అధికారులు, సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు.


పూర్తిగా శిథిలమైన విద్యా వనరుల కేంద్రం భవనం

హెల్మెట్లకు డిమాండ్..

ముదినేపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్లకు డిమాండ్ పెరిగింది. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంత ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ల వినియోగంలో ముందు కొస్తున్నారు. కోర్టు తీర్పును అనుసరించి ద్విచక్ర వాహనాల వారు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అయింది. హెల్మెట్ లేకుండా బైక్‌పై ప్రయాణిస్తే పోలీసులు కేసులు రాస్తున్నారు. దీంతో జరిమానా చెల్లించడం కంటే ఆ సొమ్ముతో ఒక హెల్మెట్ కొనుగోలు చేయడం మంచిదన్న భావన వాహనదారుల్లో కన్పిస్తోంది. ఈ క్రమంలో హెల్మెట్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ముదినేపల్లి - గుడివాడ రోడ్డు వెంబడి వ్యాపారులు హెల్మెట్ల స్టాల్స్ ఏర్పాటు చేశారు. హాఫ్ హెల్మెట్ అయితే రూ.250 నుంచి రూ.350, ఫుల్ హెల్మెట్ కంపెనీని బట్టి రూ.500 నుంచి రూ.1500 వరకు ధరలు ఉన్నాయి.


ముదినేపల్లి ప్రాంతంలో హెల్మెట్ల స్టాల్

మహిళలకు ముగ్గుల పోటీలు

కైకలూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్రీరామకృష్ణ సేవాసమితిలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. వందలాదిమంది మహిళలు ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. రామకృష్ణ సేవాసమితి నిర్వాహకులు భూపతిరాజు వర్మ, యు.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

పండుగ వేళ విషాదం


భీమవరంలో బాధిత కుటుంబ సభ్యుల రోదనలు.. చవ్వాకుల శ్యాంప్రసాద్ (ఫైల్‌ఫొటో)..

ముగ్గురు భీమవరం వాసుల మృతి.. నలుగురికి తీవ్రగాయాలు..

భీమవరం క్రైం/శంఖవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడిలో 16వ నెంబరు జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని కారు వెనుక నుంచి ఢీకొంది. అన్నవరం దైవదర్శనానికి వెళ్తుండగా జరిగిన ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమవరం టౌన్‌కి చెందిన చవ్వాకుల శ్యాంప్రసాద్, అతని బావమరిది కరింశెట్టి శివన్నారాయణ, శివన్నారాయణ భార్య దివ్య, సత్యనాగమధు, శ్యాంప్రసాద్ భార్య చవ్వాకుల ప్రసన్న, తల్లి అమ్మాజీ, కారు డ్రైవర్ నిమ్మగడ్డ ధనుష్ కలిసి శనివారం తెల్లవారుజామున అన్నవరం రావడానికి ఉదయం 4-5 గంటల మధ్యలో కారులో బయలుదేరారు. వీరి వాహనం ఉదయం 7 గంటల సమయంలో అన్నవరానికి దగ్గర్లోనే పది కిలోమీటర్ల ముందు కత్తిపూడి వద్దకు చేరుకుంది. అక్కడ ఆగిఉన్న లారీని వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో చవ్వాకుల శ్యాంప్రసాద్(50), కరింశెట్టి శివన్నారాయణ (38), కరింశెట్టి దివ్య(30) అక్కడికక్కడే మృతి చెందగా మిగిలినవారు తీవ్రంగా గాయపడ్డారు. శ్యాంప్రసాద్ భార్య ప్రసన్న, తల్లి అమ్మాజీ అపస్మారక స్థితిలో వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. డ్రైవర్ ధనుష్ మాత్రం స్వల్పంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదానికి స్పష్టమైన కారణం తెలియనప్పటికీ నిద్రమత్తుగానీ, లారీని గమనించక పోవడంగానీ అయి ఉండొచ్చని భావిస్తున్నారు. క్షతగాత్రులను తుని, ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రులకు తీసుకెళ్లారు. ప్రత్తిపాడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కరింశెట్టి శివనారాయణ మృతి చెందగా అమ్మాజీ, సత్యనాగమధులను మెరుగైన వైద్యంకోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అన్నవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆగిన లారీయే కారణం

జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీలను ఢీకొట్టడంతో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. జాతీయ రహదారిపై పార్కింగ్ ప్రాంతాల్లో మాత్రమే లారీలు నిలపాల్సి ఉండగా, ఇష్టానుసారంగా ఎక్కడబడితే అక్కడ లారీలను నిలుపుతున్నారు. ఆగి ఉన్న లారీలపై పోలీసులు తీసుకుంటున్న చర్యలు శూన్యమనే చెప్పాలి. ఏటా పదుల సంఖ్యలో మృత్యువాత పడడంతోపాటు వందల సంఖ్యలో క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు.

భీమవరంలో విషాధఛాయలు

చవ్వాకుల శ్యాంప్రసాద్ మృతితో భీమవరంలోని ఆయన నివాసం వద్ద విషాదఛాయలు అలముకున్నాయి. అతడు భీమవరం గన్నాబత్తుల వారివీధిలో ఉంటున్నాడు. ఆయనకు సంతానం లేరు. యనమదుర్రులో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతని బావమరిది అయిన కరింశెట్టి శివన్నారాయణ కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలానికి చెందినవాడు. ఆయన కూడా ప్రస్తుతం భీమవరంలోనే ఉంటున్నారు. అతనికి కూడా సంతానం లేనట్లుగానే బంధువులు తెలిపారు.

నూజివీడు పేరును అంతర్జాతీయ వేదికలపై నిలపాలి

నూజివీడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : క్రీడలకు పుట్టిల్లుగా ఉన్న నూజివీడు పేరును జాతీయ, అంతర్జాతీయ వేదికలపైన సగర్వంగా నిలపాల్సిన బాధ్యత స్థానిక క్రీడాకారులపై ఉందని, నూజివీడు డీఎస్పీ ప్రసాద్ అన్నారు. నూజివీడు డిఏఆర్ కళాశాల ప్రాంగణంలో ఆక్రోబాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ రాజా వెంకటాద్రి అప్పారావు బహదూర్ 48వ మెమోరియల్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఫ్లడ్‌లిట్ ఓపెన్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌ను శనివారం ప్రారంభించారు. కృష్ణాజిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ డి.సత్యనారాయణ, నూజివీడు సీఐ సత్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాపోటీలు ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ

గాయపడిన యువకుడి మృతి

నూజివీడు టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన నూజివీడులో చోటుచేసుకుంది. నూజివీడు మండలం పోతురెడ్డిపల్లి గ్రామానికి చెందిన తాళం భాస్కర్‌రావు (35) బైక్‌పై వెళుతుండగా ముందు వాహనంపై తీసుకువెళుతున్న ప్లాస్టిక్ వాటర్‌ట్యాంక్ మీద పడింది. దీంతో తీవ్రగాయాలపాలైన అతడిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

ఉచిత వైద్యశిబిరం

నూజివీడు టౌన్, జనవరి 11 (ఆంధ్ర జ్యోతి): నూజివీడు శ్రీనివాసా సెంటర్ వద్ద గల ఉర్దూ పాఠశాల ఆవరణలో తిరువీధి లక్ష్మీరామారావు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. విజయవాడ ఐఅండ్ జనరల్ కేర్ ఎస్.ఎస్ హాస్పటల్ ఆధ్వర్యంలో వైద్యులు ఎస్.కె నాయబ్‌రసూల్, డాక్టర్ జమ్మద్‌షాహీన్‌లు రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందించారు. వైద్య ట్రస్ట్‌ఛైర్మన్ తిరువీధి కృష్ణ పాల్గొన్నారు.

వేయింగ్ మిషన్ వితరణ

నూజివీడు టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు మండలం మొర్సపూడి పీఏసీఎస్‌కు మొర్సపూడి పీఏసీఎస్ మాజీ ఛైర్మన్‌లు పొట్లూరి గోపీనాథ్, మల్లవల్లి శోభనాద్రిల జ్ఞాపకార్థం మొర్సపూడి పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ పొట్లూరి సత్యనారాయణ, శాంతికుమార్‌లు వేయింగ్‌మిషన్, ఈపాస్ మిషన్‌లను వితరణగా అందించారు.

మినప సాగుకు నీరివ్వండి : ఎమ్మెల్సీ జయమంగళ

ముదినేపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మినుము సాగుకు నీరందించాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ కోరారు. శివారు ప్రాంతాల భూముల్లో మినుము పైరు ఎండిపోతోందని, తక్షణం కాల్వలకు నీటిని విడుదలను పెంచి పైరును కాపాడాలని ఆయన ఇరిగేషన్ అధికారులకు తెలిపారు. చిగురుకోట, చినకామనపూడి గ్రామాల ఆయకట్టు పరిధి శివారు భూముల్లో నీరందక ఎండిపోతున్న మినుము పైరును శనివారం ఇరిగేషన్ డిఈఈ శిరీషతో కలసి పరిశీలించారు. రుద్రవరం ఛానల్ ద్వారా పది రోజులుగా నీటి సరఫరా సక్రమంగా లేదని, మినుము పైరు ఎండిపోతోందని రైతులు జయమంగళ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు.


చిగురుకోటలో నీరందక ఎండిపోయిన మినుము సాగు భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ

ఆలపాటిని గెలిపించాలని ప్రచారం

ముదినేపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కైకలూరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దావు నాగరాజు కోరారు. అల్లూరులో శనివారం ఆయన టీడీపీ నాయకులతో కలసి పట్టభద్రుల ఓట్లను అభ్యర్థించారు. టీడీపీ నాయకులు నాగ రాజు, శివశంకర్, రాజమౌళి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.


కలిదిండి మండలం గుర్వాయిపాలెంలో కోడిపందేల బరిని ధ్వంసం చేస్తున్న పోలీసులు


ఆటపాకలో కోడిపందేల బరులకు ఏర్పాటు చేస్తున్న స్తంభాలను తీసివేస్తున్న పోలీసులు

కోడిపందేల బరులు ధ్వంసం

కలిదిండి/మండవల్లి/ముదినేపల్లి/కైకలూరు/ముసునూరు/నూజివీడు టౌన్/నూజివీడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కోడి పందేల నిర్వహణకు ఏర్పాటు చేసిన బరులను పోలీసులు శనివారం ధ్వసం చేశారు. బరుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. కలిదిండి మండలంలో గుర్వాయిపాలెం, పోతుమర్రు, ఎస్.ఆర్పీ ఆగ్రహారం గ్రామాల్లో ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో, మండవల్లి మండలం భైరవపట్నంలో ఎస్ఐ రామచంద్రరావు ఆధ్వర్యంలో, ముదినేపల్లి మండలం వడాలిలో ఎస్ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో కోడి పందేల బరులను ధ్వంసం చేశారు. కాగా మండవల్లి మండలంలో చింతపాడు, ఇంగిలిపాకలంక, చావలిపాడు, భైరవపట్నం, లింగాల, పులపర్రు గ్రామాల్లో కోడిపందేలతో పాటు కోతముక్క నిర్వహిం చేందుకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. కైకలూరు మండలం ఆటపాక, కొల్లేరు గ్రామాల్లో కోడిపందేల కోసం ఏర్పాటు చేసిన బరులను పోలీసులు ధ్వంసం చేసి టెంట్లు తొలగించారు. చుట్టూ కంచె వేసేందుకు ఏర్పాటు చేసిన స్తంభాలను తొలగించారు. ముసునూరు మండలంలో సంక్రాంతికి కోడిపందెలు వేసేందుకు సిద్ధం అవుతున్న బరులపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. చెక్కపల్లి, కాట్రేనిపాడు గ్రామాల్లో ఉన్న కోడిపందేల బరులను ఎస్ఐ ఎం.చిరంజీవి ఆధ్వర్యంలో శనివారం ధ్వంసం చేశారు. ఫెన్సింగ్‌ను తొలిగించి, బరులను ట్రాక్టర్‌తో దున్నివేశారు. ఎస్ఐ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ముసుగులో కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 125 మందిని ముందస్తుగా బైండోవర్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కోడిపందేలు అడ్డుకోండి

మండవల్లి : చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్న కోడిపందేలు, జూదాలను అరికట్టాలని సామాజిక కార్యకర్త, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టి.అప్పారావు డిమాండ్ చేశారు. శనివారం మండవల్లిలో వారు మాట్లాడుతూ కొందరు నేతలు ప్రత్యక్షంగా, పరోక్షంగాను నిర్వాహకులకు సహకరిస్తున్నారని ఆరోపించారు. జూదాలు వల్ల అనేక కుటుంబాలు నాశనమవుతున్నాయన్నారు.

నూజివీడు మండలంలో సంక్రాం తి కోడిపందేల నిర్వహణకు ఉద్దేశించిన బరుల ను నూజివీడు రూరల్ పోలీసులు ధ్వంసం చేశారు. నూజివీడు రూరల్ ఇన్‌స్పెక్టర్ కె.రా మకృష్ణ, రూరల్ ఎస్సై లక్ష్మణ్ బాబుల ఆధ్వర్యంలో తుక్కులూరులో బరిని ట్రాక్టర్‌తో దున్నించి ధ్వంసం చేశారు.

కోడి కత్తులు స్వాధీనం

సంప్రదాయ ముసుగులో జూదాలు నిర్వ హించినా, ప్రోత్సహించినా కఠినచర్యలు తీసు కుంటామని నూజివీడు డీఎస్పీ ప్రసాద్ హెచ్చరించారు. నూజివీడు పట్టణం గొడుగు వారిగూడెంకు చెందిన పట్నాల తిరుపతయ్యను అదుపులోకి తీసుకున్న పోలీసులు అతని వద్ద నుంచి 102 కోడికత్తులను స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు.


చెక్కపల్లిలో కోడిపందేల బరులను ధ్వంసం చేస్తున్న పోలీసులు


సానరుద్రవరంలో మినీ గోకులాలను ప్రారంభిస్తున్న పశుసంవర్ధక శాఖ ఏడీ ముస్తాఫఖాన్

మినీ గోకులాలు ప్రారంభం

కలిదిండి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో సానారుద్రవరం, భాస్కరావుపేట గ్రామాల్లో రూ.4.15 లక్షలతో నూతనంగా నిర్మించిన మినీ గోకులాలను పశుసంవర్ధక శాఖ ఏడీ ముస్తాఫా ఖాన్ శనివారం ప్రారంభించారు. ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీవో ఆనంద్ మాట్లాడుతూ మినీ గోకులాలను నిర్మించే లబ్ధిదారులకు 90 శాతం సబ్సిడీ ఇస్తారని, లబ్ధిదారుడి వాటా 10 శాతం చెల్లించాలన్నారు. గొర్రెలు, మేకల షెడ్‌లకు 70 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. వివరాలకు కలిదిండి ఎన్ఆర్‌ఈజీఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ఎంపీడీవో కొండలరావు, పశు వైద్యాధికారులు ప్రహర్ష, ఫణి, ఎంపీటీసీ మహాలక్ష్మి, భాస్కరావుపేట నీటి సంఘం అధ్యక్షుడు మంతెన సుబ్బరాజు పాల్గొన్నారు.


వడాలి జగన్నాథస్వామి దేవస్థానంలో కుడారై ఉత్సవ పూజలు నిర్వహిస్తున్న ఈవో, అర్చకులు

వైభవంగా కూడారై ఉత్సవం

ముదినేపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చినపూరిగా పేరుగాంచిన వడాలిలో సుభద్ర బలరామ సహిత జగన్నాథ స్వామి దేవస్థానంలో శనివారం కూడారై పూజలు వైభవంగా జరిగాయి. ధనుర్మాస వ్రతంలో 27వ రోజు సందర్భంగా గోదాదేవి రంగనాయక స్వాములకు 108 గిన్నెలతో ఆచార సంప్రదాయం ప్రకా రం వివిధ రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించి పూజలు నిర్వహించారు. అనంతరం గోదాదేవిని సంప్రదాయ రీతిలో సం తృప్తి పరిచేందుకు మహిళలు కోలాట ప్రదర్శన నిర్వహించారు. ఆలయంలో మహిళలు పారాయణం జరిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చాట్రాయి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు, చీపురుగూడెం, పోలవరం సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం 12న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సంజయ్ తెలిపారు. వినియోగదారులు రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఏఈ కోరారు. గాలి పటాలు ఎగరేసేవారు విద్యుత్ లైన్లు ట్రాన్స్‌ఫార్మర్లు లేని ఖాళీ ప్రదేశాలలో ఎగరవేయాలని, పిల్లలు బిల్డింగ్‌లపై గాలి పటాలు ఎగరేసేటప్పుడు పెద్దలు తప్పనిసరిగా దగ్గర ఉండాలని ఉండాలని సూచించారు.

లిబరేషన్ మండల కార్యదర్శిగా కలపాల

చాట్రాయి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ మండల కార్యదర్శిగా కలపాల వెంకటేశ్వరరావు (చిత్తపూరు) ఎన్నికైనట్లు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరనాథ్ తెలిపారు. ఇంకా 17 మందితో మండల కమిటీ ఏర్పాటు చేశామని పేద ప్రజల సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా ఓబిళ్ళనేని రాజా

చాట్రాయి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండల బీజేపీ అధ్యక్షుడిగా ఓబిళ్ళనేని ఉదయ రాజేశ్వరరావు (రాజా) రెండోసారి ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి రేలంగి శ్రీదేవి, మండల రిటర్నింగ్ అధికారి మల్లిపూడి రాజశేఖర్ ప్రకటించారు. మండలంలో బీజేపీ బలేపేతానికి అందరి సహకారంతో కృషి చేస్తానని రాజా అన్నారు.


సారా తయారీ సామగ్రితో ఎక్సైజ్ సిబ్బంది

పోతనపల్లిలో ఎక్సైజ్ దాడులు

చాట్రాయి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని పోతనపల్లిలో ఎక్సైజ్ పోలీసులు శనివారం జరిపిన దాడిలో 20 లీటర్లు సారా స్వాధీనం చేసుకొని, సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. పారిపోయిన బుజ్జిబాబుపై కేసు నమోదు చేశామని నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు.

మినీ గోకులం పేరుతో షెడ్ల నిర్మాణానికి శ్రీకారం

ఆగిరిపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పశువుల నివాసానికి కొద్దిపాటి స్థలం ఉంటే మినీ గోకులం పేరుతో షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం నెక్కలం గొల్లగూడెంలో మినీ గోకులాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో పశుపోషణ, కోళ్ళు గొర్రెలు, మేకల పెంపకానికి మెరుగైన వసతి కల్పిస్తూ పెంపకదారులను ప్రోత్సహించేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. 90 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందించే ఈ పథకాన్ని అర్హులైన ప్రతి పాడిరైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాలను విస్తృతంగా గ్రామస్థాయిలో ప్రచారం చేయాల్సిన బాధ్యత బ్యాంకర్స్ ప్రభుత్వ అధికారులపై ఉందన్నారు. అనంతరం చిన్నాగిరిపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సోమయ్య ఇటీవల ప్రమాదానికి గురై మృతి చెందడంతో వారి ఇంటికి వెళ్ళి కుటుంబాన్ని పరామర్శించారు.


గోకులాన్ని ప్రారంభించిన మంత్రి పార్థసారథి

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ముసునూరు : రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని గ్రామ టీడీపీ అధ్యక్షుడు రంగు ఆంజనేయులు అన్నారు. రమణక్కపేటలో పశుసంవర్ధకశాఖ, ఉపాధిహామీ సంయుక్త నిధులతో నూతనంగా నిర్మించిన 4 గోకులం షెడ్లను జనసేన నియోజకవర్గ నాయకులు పాశం నాగబాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. రంగు శ్రీని వాసరావు, ఉప్పే సత్యనారయణ పాల్గొన్నారు.

వైభవంగా కూడారై ఉత్సవాలు

ముసునూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ము సునూరులో శ్రీభూదేవి, శ్రీదేవి సహిత వేంకటాచల స్వామి దేవస్థానంలో ధనుర్మాస పూజల్లో భాగంగా శనివారం కూడారై ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గోదా దేవి సహస్ర నామావళి, తిరుప్పావై పారయ ణం చేశారు. 108 కలశాల్లో స్వామివారికి ప్రసాదం నివేదన చేశారు.

ఆగిరిపల్లి శోభనాచల ఆలయంలో..

ఆగిరిపల్లి :ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో కూడారై ఉత్సవం వైభవంగా నిర్వహించారు. లక్ష్మీనరసింహ స్వామికి, గోదా దేవికి ఉదయం సుప్రభాతసేవ, నిత్య ఆరాధన, 108 రకాల నివేదనను స్వామికి సమర్పించారు. అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంతకృష్ణ పూజలు నిర్వహించారు.


ఆగిరిపల్లి శోభనాచల ఆలయంలో కుడారై ఉత్సవం


ముసునూరులో పాయసాన్ని నివేదన చేస్తున్న భక్తులు


గోపవరంలో పోలీసుల అవగాహన ర్యాలీ

కోడి పందేలు వద్దు.. సంప్రదాయ క్రీడలే ముద్దు

ముసునూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): యువత, ప్రజలు సంక్రాంతి మూడు రోజులు కోడిపందెలు, జూదాలకు వెళ్ళకుండా, గ్రామాల్లో సంప్రాదాయ క్రీడల పోటీలు నిర్వహించాలని ముసునూరు ఎస్ఐ ఎం.చిరంజీవి అన్నారు. శనివారం గోపవరం, చెక్కపల్లి, చింతలవల్లి తదితర గ్రామాల్లో జూదాల వల్ల కలిగే నష్టాలపై పోలీసులు అవగహన ర్యాలీ నిర్వహించారు.

చనుబండలో ర్యాలీ..

చాట్రాయి : సంక్రాంతి పండుగ పేరుతో జూద క్రీడలు ఆడి ఆర్థికంగా నష్టపోవద్దని కోరుతూ మండలంలోని చనుబండలో శనివారం ఎస్సై రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ గీత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మండలంలో ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై, డీటీ హెచ్చరించారు. జనార్ధనవరం, ఆరుగొలనుపేట గ్రామాల్లో కోడి పందేలు జూదం వద్దని అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఏఎస్సై గజపతిరావు, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.